# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 18 జనవరి 2024


## రూ.14.50లక్షలు సీజ్

**- ఐటీ శాఖకు అప్పగింత**



ప్రొద్దుటూరు క్రైం, జనవరి 17, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు టుటౌన్ పీఎస్ పరిధిలో పట్టణ గవిని వద్ద టుటౌన్ సీఐ ఇబ్రహీం తన సిబ్బందితో తనిఖీ చేస్తుండగా బుధవారం గిద్దలూరు చెందిన వ్యక్తిని ఆపి అతని వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయడం జరిగింది. అందులో రూ.14.50లక్షలు నగదు గమనించి వాటికి చెందిన రసీదులు లేకపోవడంతో ఆ నగదును సీజ్ చేసి ఐటీ శాఖకు అప్పగించామని సీఐ తెలిపారు.

## టిడిపిలో చేరిన ఒంటిమిట్ట యువత

రాజంపేట అర్బన్, జనవరి 17 ప్రభాతవార్త



ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లె, గొల్లపల్లె గ్రామాలకు చెందిన యువకులు పార్టీ జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు సమక్షంలో బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ కండువాలతో యువకులకు జగన్‌రాజు పార్టీలోకి ఆహ్వానించారు. ఈనెల 24న పీలేరులో జరిగే చంద్రబాబు బహిరంగసభ తెలుగుదేశం పిలుస్తోంది రా... కదలిరా కార్యక్రమానికి తరలిరావాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చౌడయ్య, మోదుగుల నరసింహులు, శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొనగా పార్టీలో వై.సుబ్బరాయుడు, వై.వెంకటసురేష్, విష్ణు, వెంకటరవి, కె.వెంకటేశ్, వి.శివ, కె.శ్రీనివాసులు, వై.నాగేంద్ర, సి.శ్రీనివాసులు, భాను, నిత్య తదితరులు పార్టీలో చేరారు.

# దార్శనీకులు శ్రీకృష్ణదేవరాయలు

### శ్రీకృష్ణదేవరాయలు 533వ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



కడప కార్పొరేషన్, జనవరి 17, ప్రభాతవార్త

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాధ్యక్షుడని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా కొనియాడారు. బుధవారం కడపలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ (కృష్ణా థియేటర్) వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, టీడీపీ నాయకులు దుర్గాప్రసాద్, బాస్ జిల్లా అధ్యక్షులు దాసరి శివ ప్రసాద్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ దక్షిణ భారతదేశ చరిత్రలో మధ్యయుగ రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు మహాకీర్తి శాలి అని పేర్కొన్నారు. ఆయన పరిపాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. అలాంటి రాజనీతిజ్ఞుడుగా పేరు తెచ్చుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. దక్షిణ భారతదేశంలో కరువు లేకుండా దేశ వ్యాప్తంగా ప్రపంచ చరిత్రలో ఖ్యాతి గడించారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చిన తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించారన్నారు. ఆయన పరిపాలనలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ ఛైర్మన్ పులి సునీల్‌కుమార్, ప్రముఖ నాయకులు దుర్గాప్రసాద్, అమరప్ప, నారాయణ స్వామి, రాము, సత్య, తోట కృష్ణ, దాసరి శివ, పత్తి రాజేశ్వరి, శివ కేశవ, కిరణ్, గోపాలకృష్ణ, సంపత్, ఏ1 నాగరాజు, శివనాయక్, రామకృష్ణ, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, తేజ, పత్తి రాజేశ్వరి, కార్పొరేటర్లు బాలకృష్ణ, సుదర్శన్ రెడ్డి, ఆరీఫుల్లా, బండి ప్రసాద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

### జిల్లాకే తలమానికంగా

# క్రికెట్ స్టేడియంను అభివృద్ధి చేస్తున్నాం

**- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్**





రాయచోటి, జనవరి 17, ప్రభాత వార్త :

జిల్లాకే తలమానికంగా క్రికెట్ స్టేడియంను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్‌లు పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణ సమీపంలోని నక్కావాండ్లపల్లె దగ్గర నిర్మితమైన వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియంకు ఆర్‌కెటి రహదారి నుంచి రూ. 1.19 కోట్ల నిధులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న డబుల్ లైన్ తారు రోడ్డు ప్రారంభంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాష, వైస్ ఛైర్మన్ వైవి నందన్ తదితర ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన వీరికి ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.

**త్వరితగతిన స్టేడియం నిర్మాణాలు పూర్తి**

గ్యాలరీ, వాకింగ్ ట్రాక్ ప్రహరీ గోడ తదితర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషలు అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. డబుల్ లైన్ తారు రోడ్డు ప్రారంభం అనంతరం స్టేడియంను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ స్టేడియంలో రంజీ స్థాయి క్రికెట్ పోటీలు, ఇతర క్రీడలు నిర్వహించుకునేందుకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పిచ్ ఏర్పాటు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రీడా మైదానంలో షటిల్, వాలీబాల్, టెన్నిస్, బాస్కెట్ బాల్ కోర్టులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పచ్చదనం పెంపొందించడానికి చర్యలు చేపట్టామన్నారు. గ్రామీణ క్రీడాకారులను వరంగా ఈ స్టేడియం మారనుంద న్నా రు. సకల సౌకర్యాలను కల్పించి క్రీడా విలేజ్‌గా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి వెంకటేశ్వరరెడ్డి, మండల బిసి నాయ కుడు పల్లపు రమేష్, ఏపి ఐఐసి సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ప్రభా వతమ్మ, తిరుపాల్‌నాయుడు, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహ్మద్ ఖాన్, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ తబ్రేజ్ ఖాన్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే వైకాపా ప్రభుత్వ ధ్యేయం

### కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల, జనవరి 17, ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే వైకాపా ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని మార్కెట్ యార్డు ఆవరణలో రూ.1.20కోట్ల వ్యయంతో నిర్మించిన రైతుబజారును బుధవారం ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా జగనన్న ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని రైతుల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పంటనమోదులో ఈక్రాప్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్ అన్నారు. ఈ విధానం వలన రైతు ఏ పంట సాగుచేశారు అధికారులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి సాగుచేసిన రైతు వివరాలు పొందు పరచడం, తద్వారా రైతులు సాగుచేసిన పంటలకు ప్రభుత్వంతో పాటు బీమా కంపెనీలు నష్టపరిహారం చెల్లిస్తున్నాయన్నారు. రాయలసీమ జిల్లాలో రైతులు, ఉద్యాన పంటలైన అరటి, బత్తాయి, నిమ్మ, బొప్పాయి, తదితర పంటలను ఎక్కువగా సాగుచేస్తున్నారని, రైతులు పంటల సాగుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వమే ధరలున నిర్ణయించి కొనుగోలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. బత్తాయి రైతులకు సూట్ లేకుండా మార్కెట్‌లో కొనుగోలు చేయడం అభినందనీయమన్నారు. ఏదిఏమైనా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేపెట్టి రైతు బాంధవుడిగా నిలిచారన్నారు. ఈ కార యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ చిన్నప్ప, వైస్‌ఛైర్మన్ సర్వోత్తమరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్‌ఛైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటి కార్యదర్శి పి.రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

**- నూతన భవనాలను ప్రారంభించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి**

తొండూరు మండలంలోని మదూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్‌క్లినిక్ భవనాలకు సంబంధించిన శిలాఫలకాలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అలాగే రిబ్బన్ కత్తిరించి నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ సేవలు అందాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్, తదితర వాటిని ఏర్పాటు చేశారన్నారు. గ్రామస్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామానికి వచ్చిన ఎంపీకి స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

# రా కదలి రా సభ ఏర్పాట్లు పరిశీలించిన పుత్తా నరసింహారెడ్డి





కమలాపురం జనవరి 17, ప్రభాతవార్త

19వ తేదీన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించే "రా కదలి రా" సభకు కమలాపురం పట్టణం సిఎస్ఐ మైదానంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సభ ప్రాంగణం వద్ద భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభకు జిల్లా నలుమూలల నుండి సుమారు ఒక లక్ష మంది ప్రజలు వస్తారని అందుకు తగ్గ ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో యువ నాయకులు పుత్తా చైతన్య రెడ్డి, పుత్తా లక్ష్మి రెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదారబాషా, రామయ్య, దివాకర్రెడ్డి, జంపాల నరసింహా రెడ్డి, రెడ్డి కరీం, వాసుదేవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఐటీడీపి నబీ పాల్గొన్నారు

# అవ్వాతాత ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం

### గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష

కడప జనవరి 17, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అవ్వ తాత ముఖంలో చిరునవ్వు చూడాలని ప్రతినెల ఒకటో తేదీ ఉదయాన్నే తెల్లవారు జామునే ఇంటి తలుపుతట్టి వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్నామని, జనరంజక పాలనలో సంక్షేమ పథకాల వెల్లువని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి అంజాద్ బాష అన్నారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా...46 వ డివిజన్‌ఎం. వి. శ్రీదేవి, ఎమ్మెల్సీ ఎం. వి. రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రి నగర్ పరిధిలోని డి ఎం అండ్ హెచ్ ఓ వీధి, సమీపంలోని పలు వీధులు, ప్రాంతాలను సందర్శించారు. తొలుత సాయిబాబా స్కూల్ వద్ద నుండి ప్రారంభించారు. 148 వరోజైన గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమానికి అంజాద్ బాషాకు 46 డివిజన్ పరిధి లోని కాలనీ వాసులు, అభిమానులు, నగర ప్రజానీకం, మహిళలు పూలమాలలతో, బాణ సంచాతో ఘనంగా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు... స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వార్డు లోని అన్ని ఇళ్లకు తిరుగుతూ కుటుంబాలను కలుసుకోవడంతో పాటు, వారు పొందు తున్న లబ్ధి సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రతి కుటుంబం లబ్ది చేకూరిందని ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయగా.. పలువురు తమ సమస్యలను అంజాద్ బాషా దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని సంబందిత అధికారులకు ఆదేశించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిండు దీవెనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి తోపాటు ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రా రెడ్డి, 46వ డివిజన్ కార్పొటర్ ఎంవి శ్రీదేవి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఇతర కార్పొరేటర్లు త్యాగరాజు, యువనాయకులు ఉమైర్, నాయకులు రామ్మోహన్ రెడ్డి, మున్నా, అబ్దుల్ రౌఫ్, సంపత్, మహిళా నాయకురాల్లు టివి సుబ్బమ్మ, మరియలు, నసీమ సుల్తానా, మౌలాని, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటితో నెరవేరిన గడికోట ప్రజల కల

### రూ.13.8కోట్లతో హైలెవల్ బ్రిడ్జికి భూమి పూజ

వీరబల్లి,జనవరి17,ప్రభాత వార్త :



మండలంలోని గడికోట గ్రామపంచాయితీలో ని పెద్దూరు వద్ద మాండవ్య నది పై రూ. 13.8కోట్ల వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మంచుటకు బుధవారం భూమి పూజ చేశారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, ఉభయ జిల్లాల జిల్లి పరిషత్ ఛైర్మెన్ ఆకేపాటి అమర్ నాథ రెడ్డి, రాష్ట్ర విధ్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ జస్టిస్ సివి నాగార్జున రెడ్డిలు భూమి పూజ నిర్వహించారు. వీరితో పాటు స్థానిక ఎంపీపీ గాలివీటి వెంకట రాజేంద్రనాథ రెడ్డి, రాజంపేట నియోజకవర్గపు వైసిపి నాయకుడు గాలివీటి మధన్ రెడ్డి, మండల వైసిపి యువ నాయకుడు గాలివీటి వీరనాగి రెడ్డిలు పాల్గొనడం జరిగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు నదిపై బ్రిడ్జి లేక వర్షాలు వస్తే చాలా ఇబ్బందులకు గురవుతూ ఉండేవారన్నారు. నేటితో గడికోట ప్రజల కల నెరవేరినట్లైందని వారు తెలిపారు. జస్టిస్ నాగార్జున రెడ్డి స్వొంత ఊరు కావడంతో వారు ఉన్నత స్థాయి అధికారులతో, రాజకీయ నాయకులతో చర్చించి పట్టుదలతో ఈ హై లెవల్ బ్రిడ్జి ని తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలకు అనేకమార్లు బ్రిడ్జి నిర్మించాలని ఫిర్యాదు చేయడం జరిగింది కానీ ఈ ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో నేటి జగనన్న పరిపాలనతో బ్రిడ్జి మంజూరుకు ప్రయత్నించిన స్థానిక నాయకులకు ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఎన్నో ఏళ్ళ కల నేటితో తరకు నెరవేరిందని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మంలంలోని వైసిపి నాయకులు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# నీరు అందక బద్వేలు ప్రజల ఇక్కట్లు

### మరమ్మతుల పేరుతో ప్రజలకు తప్పని నీటి కష్టాలు
### మున్సిపాలిటీ అభివృద్ధి నిధులు ఏమైనట్లు?

బద్వేలు, జనవరి17 (ప్రభాతవార్త)

బద్వేలు ప్రాంత ప్రజలకు వారానికి లేదా నెలకు గాని కుళాయినీటి కష్టాలు తప్పడం లేదు. మాములు రోజులలో ఎలా ఉన్నా సరే పండుగ సమయాలలో నీరు రాకపోతే పరిస్థితి ఏమిటో పాలకులకే తెలియాలి. బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలుకు నీరు అందుతున్న విషయం తెలిసిందే. కాగా నీరు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు ఆగుతుందో తెలియని పరిస్థితి. కారణం ఎక్కడో ఒక చోట మరమ్మతులకు గురికావడమే. దీనికి తోడు పట్టణంలో ముఖ్య అవసరాలకు ఉపయోగపడే అక్కడక్కడా ఉన్న బోరింగ్‌లు సైతం మరమ్మతులకు గురి కావడంతో ప్రజలు మున్సిపల్ కుళాయి నీటి మీద ఆధారపడాల్సి వస్తోంది. కుటుంబంలో తక్కువ సంఖ్యలో సభ్యులు ఉంటే సరే, అధిక సంఖ్యలో కుటుంబ సభ్యులు ఉంటే అక్కడ నీటిని అమృతంలా వాడుకోవాల్సిన పరిస్థితి. ప్రజల పరిస్థితి ఇలా ఉంటే ఇక పశువుల పరిస్థితి చెప్పనక్కర లేదు.వాటికి నీటిని తాపించాలన్న పరిస్థితి తలుచుకుంటే రైతులు పడే ఇబ్బందులు అంత, ఇంతా కాదు. కేవలం బ్రహ్మం సాగర్ నీటిని అందించేందుకు ప్రభుత్వం రూ.110 కోట్లు వెచ్చించి అట్టహాసంగా ప్రారంభించినా ప్రజలకు సరైన రీతిలో నీటిని వినియోగించడంలో మున్సిపల్ శాఖ విఫలమైందనే చెప్పవచ్చు. మొదట్లో బ్రహ్మంసాగర్ నీరు ప్రతిరోజూ వస్తుంది. ఇక బద్వేలు వాసుల నీటి కష్టాలు తీరినట్లేనని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన ప్రజాప్రతినిధులకు తాము చెప్పిన హామీలు కొద్దిరోజులకే పరిమిత మయ్యా యని చెప్పవచ్చు. కారణం రానురాను రెండురోజులకు ఒకసారి గంట, అరగంటో వదలడం తమ పని అయిపోయిందనుకుని మున్సిపల్‌వారు చేతులు దులుపుకుంటున్నారు. ఇక రానున్న వేసవి కాలంలో ఈ నీటిని ఇంకా మూడురోజులు, నాలుగు రోజులకు వదులుతారేమోనని ప్రజలు ఆందోళన చెందు తున్నారు. ఎక్కడైనా బ్రహ్మంసాగర్ పైపులు మరమ్మతుకు గురైతే వాటిని రిపేరు చేయించేందుకు రూ.5 నుంచి 10వేలు అవుతుంది. అయితే అందుకు కూడా రెండు, రోజుల సమయం వెచ్చిస్తు ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటే మున్సిపాలిటీ ఏ దుస్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే గతంలో ప్రతి రోజూ మున్సిపాలిటీ కుళాయికి నీరు వచ్చేవి అని చెప్పుకోవాల్సి వస్తుందే మోనని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాము ఏ ఆశయంతో కోట్ల రూపాయలు వెచ్చించి బ్రహ్మంసాగర్ పైపు లైన్ ఏర్పాటు చేశారో దానిని ప్రజలకు ఉపయోగపడేలా చూసి నీటి కష్టాలనుంచి వారికి విముక్తి కల్పించాల్సిన అవసరం ఉంది.



## పూర్వ విద్యార్థుల,ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



మైదుకూరు జనవరి 17,ప్రభాత వార్త

మైదుకూరు ప్రొద్దుటూరు రోడ్డులో గల యస్‌సిసిఆర్ కల్యాణ మండ పం నందు మైదుకూరు జడ్పిహెచ్ హైస్కూల్‌లో 1995-96 సంవత్స రములో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల,ఉపాద్యాయుల ఆత్మీయ సమ్మేళనము బుధవారం ఘనంగా నిర్వహించారు, ఈ సంధర్భంగా ఉపాద్యాయులు మాట్లా డుతూ 1996వ సంవత్సరము 10వ తరగతి పాసైన తర్వాత ఏదో ఒక సంద ర్భంలో కలిసిన వాళ్ళు కొంతమంది ఉంటె ,మరి కొంత మంది విద్యా, ఉపాధి వివాహం ఇతర కారణాలతో ఎక్కడెక్కడో వెళ్ళి స్థిరపడటం జరిగిందని అయితె ఇన్నేలయిన మధురాను భూతులు, ఆత్మీయ పలకరింపులు, ఉపాధ్యాయుల వాత్సల్యం, మరుపు రానిదని అజార మరణమైనవని. ఈ జావన పోరాటంలో విద్య ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు బాధ్యతల్లో మునిగి తెలిన మీరు మన ఉరకల పరుగుల జీవితా ల్లో ఒక రోజును మరల మన మిత్రులతో, ఉపాధ్యాయులతో గడిపి పాత జ్ఞాపకాలను నెమరువేసుకోనే అపూర్వ అవకాశం మనకు కలిగినం దుకు ఈ ఆత్మీయ కలయిక కుటుంబాలతో సహో పాల్గొని ఈ రోజును మన జీవి తాలతో మరోజ్ఞాపకం గుర్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## చెవులు, ముక్కు, నోరు మూసుకుని అంగన్వాడీలు నిరసన

మైదుకూరు జనవరి 17, ప్రభాత వార్త

అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చెరిందని ఐనప్రభుత్వం నుండి ఎలాంటి సమాధానం రాలేదని అందుకు నిరసనగా మైదుకూరులో కళ్లు, చెవులు, నోరు మూసుకొని వినుత్నంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి జి.శివకుమార్,ఎఐటియుసి నియోజకవర్గ నాయకులు పి.శ్రీరా ములు మాట్లాడుతూ మహత్మగాంధీ చెడు వినవద్దు, చెడు మాట్లాడవద్దు, చెడు చూడవద్దు అని సూక్తులు చెప్పాడని నేటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వీరు చెస్తు న్న సమ్మెను కళ్ళతో చూడటం లేదని వారి డిమాండ్లను చేవులుండి వినడం లేదని, వారి సమస్యలను పరిష్కరిస్తామని నోటితో చెప్పకపోవడంతో నేడు కళ్ళు, చెవులు, నోరు మూసుకోని నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11వ తెదీన అంగన్వాడీలకు సోకాజ్ నోటీసు ఇచ్చిందని వాటికి సమాధానాలు చెప్పాలని తెలిపింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వై.అజయ్‌కుమార్, యూనియన్ నాయకురాళ్లు చెన్నమ్మ, అంజనా దేవి, ధనలక్ష్మీ, భారతీ, లక్ష్మీ, అనూరాధ, ప్రవళిక, ప్రభావతి,శ్యామల, రమా దేవి, రామ తులసీ, రిజ్వానా, అన్నపూర్ణ, లత, శ్రీదేవి పాల్గోన్నారు.

## ఆడుదాం ఆంధ్ర..

పెండ్లిమర్రి, జనవరి 17, ప్రభాతవార్త



ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని జూనియర్ కళాశాల లో బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు నందు నందిమండలం జట్టు, మమిళల జట్టు నందు పాత సంగటి పల్లె అలాగే కబడ్డీ పోటీలలో పాత సంగటిపల్లె నియోజకవర్గం స్థాయికి ఎంపికైనట్లు మండల అభివృద్ధి అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్లటూరు పంచాయతీ కార్య దర్శి లక్ష్మీపతి, ఈఓపీఆర్డీ ఆర్డీ శివరామిరెడ్డి, కార్యదర్శులు సుధాకర్, ప్రశాంత్, సాగర్, చంద్రశేఖర్, భాస్కర్, సుధీర్, రమాదేవి పాల్గొన్నారు.

## నిరంకుశ నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 17, ప్రభాతవార్త



నిరంకుశ నిర్బంధాలతో ఉద్యమాలను, పోరాటాలను ప్రభు త్వం ఆపలేదని సీఐటీయూ జిల్లా ట్రెజరర్ హరిశర్మ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్ వాడీ జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీని వాసులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యంగా సీఐటీఊ, ఏఐటీయూసీ ఐఎన్టీయూ సంఘాలు కలుపుకొని ప్రతి రోజూ నిరవధిక నిరాహారదీక్షలు కొనసా గిస్తామని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విజ యం సాధించే వరకు ఆపబోమని పేర్కొన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయో గించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లా డుతూ దళితులు బీసీలు, మైనార్టీలు నా బంధువులు, నా అక్క చెల్లెమ్మ లు అని చెప్పే సీఎం పండగ రోజు సెట్టింగ్‌కు 1.50కోట్లు ఖర్చు పెట్టారు. సామా న్యుల సమస్యలు ఆయనకు పట్టడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అంగన్ వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, కార్యదర్శి ఓబులమ్మ, ప్రభావతి, సెక్టార్ లీడర్లు రామా పురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## మండల స్థాయి కబడ్డీ విజేత చియ్యపాడు జట్టు



చాపాడు, జనవరి 17, ప్రభాతవార్త

ఆడుదాం ఆంధ్రలో భాగంగా బుధవారం చియ్యపాడు గ్రామంలో జరిగిన కబడ్డీ పోటీలలో చియ్యపాడు జట్టు విజయం సాధించింది. ఇందులో మదూరు, ఎన్.ఓబాయపల్లె, వెదురూరు జట్లు పాల్గొనగా చియ్యపాడు జట్టు విజయం సాధించి నియోజికవర్గ స్థాయిలో పాల్గొననున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వ్యాయామఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 37వ రోజుకు చేరిన అంగన్వాడీల దీక్ష

చాపాడు, జనవరి 17, ప్రభాతవార్త



తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా అంగన్వాడీలు గత నెల రోజులకు పైగా వివిధ రూపాలలో తమ సమ్మెను ప్రభు త్వా నికి తెలిపిన పట్టించుకోవడం లేదు. ఈ సంధర్భంగా బుధవారం జరిగిన సమ్మెకు మద్దతుగా కమళా పురం, జమ్మలమడుగు సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, ప్రసాద్ మద్దతు తెలిపి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మండల యూనియన్ అధ్యక్షులు సుజాత, శ్రీదేవి, సరస్వతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## ముద్దనూరు ఎస్ఐగా మైనుద్దీన్ బాధ్యతలు స్వీకరణ

ముద్దనూరు, జనవరి 17, ప్రభాతవార్త



ముద్దనూరు పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్‌స్పెక్టర్‌గా చాపాడు నుంచి బదిలీపై మైనుద్దీన్ బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సంధర్భంగా ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా తమ విధులను సక్రమంగా నిర్వహిస్తానని, సంఘ విద్రోహులు, మట్కా, జూ దం, ఇసుక అక్రమ రవాణా వంటి అసాంఘీక కార్య కలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అటువంటి వారి గురించి సమా చారం ఉంటే తమకు తెలియ జేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ సంధర్భంగా స్థానిక పోలీసులు స్వాగతం పలికి శుభా కాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ చంద్రమోహన్ కడప తాలుక పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా పైడికాల్వ నాగరాణి

కడప వైద్యవిభాగం, జనవరి 17, ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా పైడి కాల్వ నాగరాణి నియా మకాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తులసిరెడ్డి చేతుల మీదుగా అందజేసినట్లు ఒక ప్రకటన లో ఆమె తెలిపారు. తను పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఈ పదవిని ఇవ్వడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధానిని చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## వ్యవసాయ సలహా మండలి సమావేశం



ముద్దనూరు, జనవరి 17, ప్రభాతవార్త

ముద్దనూరు మండలం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంను చైర్మెన్ దస్తగిరి సమ క్షంలో బుధవారం రోజు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకట సుబ్బయ్య మాట్లా డుతూ రబీలో సాగు చేసిన అన్ని పంటలను పంట నమోదు చేయించుకోవాలని రైతు లకు తెలిపారు. ప్రతి రైతు బాధ్యతగా పంట నమోదు చేయించుకోవాలని కోరా రు. అనంతరం దస్తగిరి మాట్లాడుతూ ఆర్‌టిపిపి కర్మాగారము నుండి వెలు వడు తున్న దుమ్ము, ధూళి సాగులో ఉన్న పంటలపైన పడి దుష్ప్రభావము కలిగి పంట పెరుగుదల లేక, పూత, పిందె సరిగా రాక దిగుబడులు తగ్గుతున్నా యని తెలిపారు. సంబంధించిన అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరారు. వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళతామని తెలిపారు. ప్రతి రైతు ఈకేవైసి పూర్తి చేయించుకోవాలని కోరారు. ఇంకా కొంత మంది రైతులకు పంట ఇన్సూరెన్స్ డబ్బులు రాలేదని త్వరగా వచ్చేలా కృషి చేయాలని అధికారులను సలహామండలి సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం

ముద్దనూరు, జనవరి 17, ప్రభాతవార్త



ముద్దనూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మె ల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ముద్ద నూరు మండల వ్యాప్తంగా తెలుగు దేశం పార్టీ కార్యకర్తలతో బుధవారం నాడు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈనెల 19వ తేదిన కమలాపురంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగబోయే 'రా కదలిరా' కార్యక్రమానికి పెద్దఎత్తున జన సమీకరణ చేసి కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షులు శివరాంరెడ్డి, అబ్దుల్‌ఖాదర్, రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, రంగారెడ్డి, పురుషోత్తం, నాగేశ్వరరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధారాలు లేని నగదు స్వాధీనం

దువ్వూరు, జనవరి 17, ప్రభాతవార్త

మండల పరిధిలోని ఎడమడక తనిఖీ కేంద్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి ఆధారాలు లేని రూ.11లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు దువ్వూరు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. హైదరాబాదు నుంచి వస్తున్న కారులో ఇద్దరు వ్యక్తులు సుదర్శన్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి నుంచి నగదు స్వాధీనం చేసు కోవడం జరిగిందన్నారు. మరో సంగటనలో తనిఖీ కేంద్రం వద్ద సాదక్ హుసేన్ వద్ద నుంచి రూ.2.07లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభకు ప్రొద్దుటూరు నుండి 5బస్సులు

ప్రొద్దుటూరు, జనవరి 17, ప్రభాతవార్త



భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతి బింబిస్తూ విజయవాడ నడిబొడ్డున సుమారు 19ఎకరాల సువిశాల మైదానంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ సభకు ప్రొద్దుటూరు నుండి తరలి వెళ్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొ న్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ప్రపంచ పర్యాటకులు ఆకర్షించే విధంగా మ్యూజికల్ మౌంటెన్ లైబ్రరి మ్యూజియం కన్వెన్షన్ సెంటర్ అంబేద్కర్ జీవిత విశేశాలను తెలియ జేస్తూ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. పండుగ వాతావరణంలో విగ్రహ విష్కరణ జరుగు నేపధ్యంలో రాష్ట్రం నలుమూలల నుండి దళిత జాతి నాయ కులు బిడ్డలు, అగ్రవర్ణాలకు చెందిన ప్రజాస్వామ్య వాదులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సంధర్భంగా ప్రొద్దుటూరు నియోజికవర్గం నుండి సుమారు 25 వేల మంది విజయవాడకు తరలి వెళు తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ప్రొద్దుటూరులోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు వారి వారి వాహణాలలో విజ యవాడ చేరుకుంటారని సీఎం జగన్ మోహన్ రెడ్డి చేతులమీదుగా విగ్రహా విష్కరణ అనంతరం తిరిగి ప్రొద్దుటూరు బయలుదేరుతారని తెలిపారు. ఈ సమావేశంలో పోరెడ్డి నరసింహారెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి, దళిత నాయకులు సుధాకర్ మాదిగ, గోసా మనోహర్, ప్రాస్తం యాకోబు పాల్గొన్నారు.

## ఎర్రగుంట్లలో 2 కిలోల బంగారం స్వాధీనం

ఎర్రగుంట్ల జనవరి 17, ప్రభాతవార్త

ఎర్రగుంట్ల పరిధిలోని రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం ఎర్రగుంట్ల పోలీ సులు రెండు కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివ రాల ప్రకారం ఎర్రగుంట్ల పోలీ సులు రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద వాహానాలు తనిఖీ చేస్తుండగా పొద్దుటూరు నుండి తమిళనాడు తిరుత్తనికి ముగ్గురు వ్యక్తులు బంగారం తరలిస్తున్నట్టు రెండు కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు, దీనికి సంబంధించిన పూర్తి వివ రాలు తెలియాల్సి ఉన్నట్లు తెలిపారు

## సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ

ప్రొద్దుటూరు, జనవరి 17, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం 39వ వార్డులో 50 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశా రు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘం అభివృద్ధిలో భాగంగా 39వ వార్డులోని గాడిది కొట్టాల ప్రాంతంలో సుమారు 800మీటర్లరోడ్డు విస్తరణ సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కొన్ని ఏళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు పడుతూ ఈ ప్రాంత ప్రజలు అసౌకర్యానికి గురయ్యారన్నారు. ఈ ప్రాంత ప్రజలి అందరి అభిప్రాయం మేరకు రోడ్డు విస్తరణ పనులు చేపడతామని ప్రజలకు వ్యతి రేకంగా ఇలాంటి పనులు చేపట్టబోమని ఆయన తెలిపారు. రోడ్డు విస్తరిస్తే అన్ని రకాలు గా అభివృద్ధి చెందుతుందని దొరసానిపల్లె రోడ్డు నుండి బొల్లవరం రోడ్డు వరకు ఇలాంటి ఆటంకం లేకుండా ప్రయాణం కొనసాగు తుందన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా నిరుపేదలు జీవిస్తున్నారని, ప్రోత్సహించే క్రమంలో ఇళ్ల లేదా గుడిసెలో కొంతభాగం నిర్మించుకొని ఉంటారన్నారు. ప్రజాభిప్రాయం మేరకే రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ అనిల కుమార్, షేక్ కమాల్‌బాష, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మల్లికార్జున యాదవ్, వైసిపి నాయకులు మీగడ చంద్రశేఖర్ రెడ్డి, డీలర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

గోపవరం,జనవరి 17 ప్రభాతవార్త;

నేడు ఉదయం గం,10 నుంచి సాయత్రం 5గంటల వరకూ విద్యుత్ అంత రాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖాధికారి చిన్నయ్య బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు.గోపవరం,అట్లూరు,బద్వేలు,కు చెందిన 132 కేవి బద్వేలు సబ్‌స్టేషన్ కు సంబందించన విద్యుత్ సరపరాలో అంతరాయం ఉంటుం దన్నారు. విద్యుత్ మరమత్తుల నిమిత్త ఈ అంతరాయం ఉంటుం దన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని తెలిపారు. ఈ మేరకు డిఏఈ కుల్లా యప్ప తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

## పరీక్ష పే చర్చ పెయింటింగ్ పోటీలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 17, ప్రభాతవార్త

పరీక్ష పే చర్చా 2024కు కొనసాగింపుగా దేశ వ్యాప్తంగా 500 కేంద్రీయ విద్యాలయాల్లో దేశవ్యాప్తంగా పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. పరీక్షల ఒత్తిడిని తట్టుకునేందుకు విద్యార్తులకు ఇది ఒక ప్రత్యేక కార్యక్రమమని కడప జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి అన్నారు. పెయింటింగ్ పోటీల్లో 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్తులు మాత్రమే అర్హులు. పెయింటింగ్ ఈవెంట్ లో థీమ్స్, చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా, వికసిత్ భారత్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆదిత్య ఎల్-1పై పోటీలలో పాల్గొన్న ఆసక్తి గల విద్యార్థులు 23వ తేదీ ఉదయం 9 గంటలకు కేంద్రీయ విద్యాలయ సంస్థ కడప నందు హాజరుకావాలన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం షర్మిలతోనే సాధ్యం

-కమలాపురం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి

కడప, జనవరి 17, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలిగా నియమిచడంతో కాంగ్రెస్ పార్టీని పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి సాధ్యమవుతుందని కమలాపురం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొట్టిపాటి చంద్ర శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన కోసం షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభదాయకం అన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల రావడంతో పాతతరం కొత్త తరం నాయకులు కలసి నూతన ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీని నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేయడం జరిగింది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని తప్పకుండా ఏర్పాటు చేస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగింది.

## శ్రీకృష్ణదేవరాయల 533వ జయంతి వేడుకలు



కడప వైద్యవిభాగం, జనవరి 17, ప్రభాతవార్త

కడప కళాక్షేత్రంలో బుధవారం శ్రీకృష్ణదేవరాయలు 533వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ రామచంద్ర్య, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఇతర ముఖ్య నేతలు నివాళి ఘనంగా అర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 500 ఏళ్ల నుంచి ఆయన పాలన ఇంకా ప్రజల్లో గుర్తుకు ఉండిపోయేలా సాగిందని గుర్తు చేశారు. శ్రీకృష్ణ దేవరాయలును యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైసీపీ నేతలు హడా విడిగా విగ్రహాన్ని ప్రారంభించారని రానున్న కాలంలో జయంతి ఉత్సవాలను ప్రభుత్వం తరుపున చేయించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు అమరప్ప, దుర్గాప్రసాద్, జనసేన ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్, బలిజ సంఘం నాయకులు నాగరాజు, సమతం రాము, బండారు సత్యనారాయణ, బండి బాబు, సమతం రాము, వైసీపీ నాయకులు కేవస్ఆర్, వేణు, బాస్ జిల్లా అధ్యక్షులు దాసరి శివ, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, ఎంప్లాయిస్ యూనియన్ మస్తాన్, రాయల్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ కబడ్డీ పోటీలు విజయవంతానికి ఏర్పాట్లు

జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



రాజంపేట అర్బన్, జనవరి 17 ప్రభాతవార్త

ఈనెల 28 నుంచి రాజంపేట పట్టణం ఇన్‌ఫాంట్ స్కూల్లో జరగనున్న జాతీయస్థాయి బాలికల కబడ్డీ పోటీలు విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికతో వెళ్లాలని జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆదేశించారు. టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా అవసరమైన పనులకు ఆకేపాటి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ వరలక్ష్మీ, ప్రాంతీయ వ్యాయామ తనిఖీ అధికారి భానుమూర్తిరాజు, ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ ప్రె సిడెంట్ ఎస్.సుబ్రమణ్యంరాజు, పిఇటి పార్థసారధి, వైకాపా నేతలు ఎస్.మునాఫ్, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షులుగా షర్మిలమ్మ నియామకంపై హర్షం



కడప వైద్యవిభాగం, జనవరి 17, ప్రభాతవార్త

పీసీసీ అధ్యక్షులుగా షర్మిలను నియమించడం చాలా సంతోషంగా ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఆంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటిసారిగా మహిళా పీసీసీ అధ్యక్షురాలుగా షర్మిల నియమితులవడం సంతో షంగా ఉందన్నారు. గతంలో వెస్.రాజశేఖర్‌రెడ్డి రెండు సార్లు పీసీసీ అధ్యక్షు లుగా ఉండడం మరలా తిరిగి ఆయన కుమార్తె షర్మిల పీసీసీ అధ్యక్షురాలుగా అవడం కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో శుభ పరిణామమన్నారు. ఏపీ కాంగ్రెస్ పార్టీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులుగా గిడుగు రుద్రరాజును నియమించడం చాలా మంచి పరిణామమన్నారు. సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు విష్ణుప్రీతంరెడ్డి మాట్లాడుతూ షర్మిల నియామకంపై అవాకులు పేలుతున్న మంత్రి గుడివాడ అమర్నాథ్ ఒక లేడి పార్టీకి ఒక కొత్త లేడీ అధ్యక్షురాలు వచ్చారన్నారు. లేడీ పార్టీ అని మాట్లాడే అమర్‌నాథ్ ఒకసారి ఆలోచించుకోవాలి చరిత్ర కలిగిన మా పార్టీ గురించి మీరు మాట్లాడే అర్హత లేదన్నారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పీసీసీ డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామ లమ్మ, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఆనంద్, ఎన్ఎస్‌యూఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## 37వ రోజుకు అంగన్‌వాడీల నిరసన

రాయచోటి, జనవరి 17, ప్రభాత వార్త :



అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం అవ సరమైతే ఆమరణ నిరాహార దీక్షలకైనా సిద్దంగా ఉన్నాయని అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసి) కన్వీనర్ నాగేశ్వరి అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెలో భాగంగా 37వ రోజు రాయచోటి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు నిరసన వ్యక్తం చేసి ఐసిడిఎస్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు అడుగుతూ ప్రజా జీవవానికి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతా వరణంలో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీ వర్కర్లపై అక్రమ కేసులు బనా యించడం ప్రభుత్వ దర్మార్గపు చర్య అన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 37 రోజులుగా రాష్ట్ర వ్యాస్తంగా అంగన్వాడీలు రోడ్లపైకి వచ్చి వివిధ రకాలుగా నిరసనలు వ్యక్తం చేయడంతో పాటు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నా ఈ ప్రభుత్వానికి అంగన్‌వాడీ బాధలు పట్టడం లేదన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొం టున్న సమస్యలు పరిష్కరించక పోగా సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల ద్వారా, అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి దౌర్జన్యంగా సెంటర్‌లోకి వెళ్లి సమస్యలను సృష్టించడం ప్రభుత్వానికి తగదన్నారు. వివిధ రూపాలలో నిరస నలు తెలియజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు) యూని యన్ల లీడర్లపై పోలీసుల చేత అక్రమ కేసులు బనాయించి భయబ్రాం తులకు గురి చేసేందుకు ఈ ప్రభుత్వం కుట్రలు చేయడం దారుణం అన్నారు. కార్య క్రమంలో అంగన్‌వాడీ వర్కర్ అండర్ హెల్పర్ యూనియన్ లీడర్లు సుజాత, సంధ్య, రజిని, వీరబల్లి, భారతి, తులసి, దుర్గ, విజయ, కుమారి, రేణుక, స్వర్ణకుమారి, పద్మావతమ్మ, రామతులసమ్మ అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## మామిడి మొక్కలు నరికి ముళ్ల కంచెను తొలగించారంటూ పోలీసులకు ఫిర్యాదు



వీరబల్లి,జనవరి17,ప్రభాత వార్త :

మండంలోని మట్లి పంచాయితీలోని పత్తిరాజుగారిపల్లెలో చమర్తి చంద్రమ్మ భూమిలో నాటిన మామిడి మొక్కలను భూమి చూట్టూ వేసిన రాతి మెళ్ల తొంతెలను రాత్రికి రాత్రే తొలగించారంటూ బుధవారం స్థానిక పోలీస్ స్లేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. అదేగ్రామానికి చెందిన చమర్తి చంద్రమ్మ కు చెందిన సర్వే నెంబర్ 497,498 భూమిలో గత 3 నెలల క్రితం మామిడి చెట్లను నాటడం జరిగిందని అలాగే భూమి చుట్టూ రాళ్ళ కూసాలు నాటి ముళ్ల తొంతెను ఏర్పాటు చేశామన్నారు.కాగా మంగళవారం రాత్రి ఎవరూ లేని సమయం చూసి కొందరు దుండగులు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆమె ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ రాళ్ల ముళ్ళ తొంతెను దాదాపు రెండు లక్షల రూపాయల ఖర్చు చేసి ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొ న్నారు. అదే గ్రామానికి చెందిన పలువురి మీద అనుమానా లున్నాయని వారు వాలింటీర్ రెడ్డెయ్య రాజు, కానిస్టేబుల్ రవీంద్ర రాజు, ఆర్టీసీ డ్రైవర్ వెంకట రాజు, హస్తి కృష్ణంరాజు, గరుడయ్య కుమారుడు వెంకట్రాజు ల మీద అనుమా నలు ఉన్నాయని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనందరం స్థానిక విలేఖర్లతో ఆమె మాట్లాడుతూ ఇది చాలా అన్యాయం అని పాత కక్షలు మనసులో పెట్టుకొని ఇలా చేశారని ఆమె వాపోయారు. ఇటువంటి సంఘటన లను కావాడవలసిన బాధ్యత గల పోలీస్ అయిన రవీంద్ర రాజు, అదేవిధంగా ప్రజల సంక్షేమం కోసం పాటు పడవలసిన వాలెంటీర్ రెడ్డెయ్య రాజు లు ఈ అఘాయిత్యానికి మూల కలరణం అని తెలిపారు. నన్ను నాభర్తను, నా కుటుంభాన్ని చంపలేక ఇలా నీచ మైన అన్యాయానికి పాల్పడ్డారని వీరిపై చట్టపర మైన చర్యలు తీసుకొని శిక్షిం చాలని విలేఖర్ల ముందు వాపోయారు. స్థానిక పోలీసులు రెవెన్యూ సిబ్బంది స్పందించి తమకు న్యాయం చేయాలని తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు. తమకు న్యాయం జరగకపోతే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళతామని ఆమె తెలిపారు. గతంలో ఇలాం టి సంఘటనలు మండలంలో చాలా జరిగాయి. ఇలా అన్యాయాలకు అక్రమాలకు పాల్పడిన వారిపైన పోలీసు సిబ్బంది గానీ, రెవెన్యూ సిబ్బంది గానీ చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు తెలిపారు.

## డిక్సాన్‌లో సంక్రాంతి సంబరాలు

– హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్

కడప వైద్యవిభాగం, జనవరి 17, ప్రభాతవార్త



కడప నగర శివార్లలోని ఇండస్ట్రి యల్ పార్కులో డిక్సాన్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు పని ఒత్తిడి అధిగ మించేందుకు పండగ వాతావరణంలో కార్మికుల కోసం రంగోలి, ట్రెడిషనల్ డ్రెస్ పోటీలు సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించామని హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా గెలు పొందిన వారికి బహుమతులు ప్రదానం చేయడం జరిగిందన్నారు. మొత్తంగా అధిక సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పోటీలలో ఉత్సాహంగా పాల్గొనడం జరిగిందన్నారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా అకౌంట్ విభాగం నుంచి బల్జిత్, ప్రొడ క్షన్ శాఖ నుంచి ఓం ప్రకాష్, సుధీర్, మెయింటెనెన్స్ శాఖ నుంచి రామమోహన్, హెచ్‌ఆర్ ఆఫీసర్లు మణి కంఠరెడ్డి, పీరా పాల్గొన్నారు.

# కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసిన టీడీపీ సీనియర్ నాయకుడు వల్లిగట్ల రెడ్డప్ప

కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:



తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని బుధవారం ప్రముఖ పారిశ్రామికవేత్త తెదేపా సీనియర్ నాయకులు వల్లిగట్ల రెడ్డప్ప నగిరిపల్లెలో కిశోర్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రెడ్డప్ప తెదేపాలో ప్రముఖ నాయకుడిగా పార్టీలో చురుగ్గా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. గత కొద్ది సంవత్సరాలుగా పార్టీకి దూరంగా ఉంటూ తన వ్యాపారాల పనుల్లో నిమగ్నమయ్యాడు. మళ్లీ తెదేపా విజయానికి కృషి చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెదేపాను విజయపథంలో నడిపించాలని బుధవారం కిశోర్‌కుమార్‌ని కలిశారు. ఈ సందర్భంగా రెడ్డప్ప మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెదేపా విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ కురభ సంఘం కన్వీనర్ జనార్ధన్‌గౌడ్, టీడీపీ యువ నాయకుడు రెడ్డి శేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు రవి యాదవ్, కలకడ మండలం టీడీపీ నాయకులు కమల్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికలతో పంచాయతీలు అభివృద్ధి చేసుకోవాలి

– ఎంపీడీవో గంగయ్య

కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:



మండలంలోని గ్రామ పంచాయతీలలో సర్పంచులు, కార్యదర్శులు ప్రణాళికలు తయారు చేసుకొని పంచాయతీలు అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌జీఎస్ ఏపై సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీడీపీపైన 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసే అంశాలపై పంచాయతీ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యసిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి

– ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్

కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:

పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 15న వైద్యాధికారి, వైద్యసిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు పీవీ చంద్రశేఖర్, సెక్రటరీ పి.వై.పవన్‌కుమార్, ట్రెజరర్ ఈశ్వర్ సురేంద్రలు డిమాండ్ చేశారు. ఈనెల 15న ఓ వ్యక్తి విషం సేవించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రావడం వారికి వైద్య సేవలు అందించే సమయంలో వైద్యాధికారిపైన, వైద్యసిబ్బందిపై అక్కడున్న పరికరాలతో దాడికి పాల్పడడం బాధాకరమన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మెడికల్ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

# కలికిరి ఎస్సై ఎస్‌కే రహీముల్లా బదిలీ

కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:

కలికిరి ఎస్సై ఎస్‌కే రహీముల్లాను కేవీ పల్లి ఎస్సైగా బదిలీ చేస్తూ అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కేవీ పల్లి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న లోకేష్‌ను వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో గత ఆరునెలల సమయంలో కలికిరి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రహీముల్లాను కేవీ పల్లికి బదిలీ చేయడం జరిగింది. ఇంకా కలికిరి కలికిరి పోలీసు స్టేషన్‌కు సీఐని ఓ ఎస్సైని నియమించాల్సి ఉంది. కానీ ఇంత వరకు నియామకం జరగలేదు.

# డా.వెస్లీ ట్రస్ట్ ఆధ్వర్యంలో తినుబండారాలు పంపిణీ

తంబళ్లపల్లె, జనవరి 17, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల కేంద్రం సమీపంలోని పరసతోపులో గత కొంత కాలంగా గూడారాల్లో నివసిస్తున్న సంచార జాతి నిరుపేదలు, పిల్లలకు, ఆరోగ్యవరానికి చెందిన దివంగత డా.వెస్లీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రొట్టెలు, బిస్కెలు, పలు రకాల తినుబండారాలు పంపిణీ చేశారు. అదే విధంగా తంబళ్లపల్లెకు సమీపంలోని సంతోపు వద్ద గల సంచార జాతి పిల్లలకు సైతం తినుబండారాలు పంపినీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ చిన్నారులను బడికి పంపాలని చదువు కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి సహకరిస్తుందని ప్రతి చిన్నారి తప్పక బడిలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ డా.వెస్లీ మృతి తీరని లోటని ఆయన మదనపల్లి, తంబళ్లపల్లె ప్రాంత నిరుపేద రోగులుకు చేసిన సేవలు మరువరానివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, పలువురు యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# కులగణన సర్వే నిష్పక్షపాతంగా పూర్తి చేయండి

– ఏవో ఆనంద్‌కుమార్

తంబళ్లపల్లె, జనవరి 17, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలోని 21 పంచాయతీలలో కులగణన అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా నిర్వహించాలని మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కుల గణనపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. పంచాయతీలలోని ప్రతి గ్రామంలో ప్రతి గడపలో ఈనెల 19వ తేదీ నుంచి 28 వరకు ముమ్మరంగా సర్వే నిర్వహించాలన్నారు. కుల గణన సర్వేలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లెలో కనుమ పండగ సంబరాలు

తంబళ్లపల్లె, జనవరి 17, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల కేంద్రంలో బుధవారం స్థానిక రైతులు, ప్రజలు కనుమ పండగను వైభవంగా జరుపుకున్నారు. ఉదయం పశువులను శుభ్రం చేసి పూలు మరియు బెలూన్లతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మల్లయ్యకొండ రహదారిలోని చిట్లాకుప్ప వద్ద గల కాటమరాజు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పశువులను చిట్లాకుప్ప మంటల చుట్టూ ప్రదక్షిణలు చేయించి రాబోయే పంట కాలంలో ప్రతి ఇంటిలో పాడి పంటలు సమృద్ధిగా పండి సుఖ సంతోషాలు అమరి అష్టైశ్వర్యాలు సమకూరాలని కాటమరాజును కోరుకున్నారు.

# ఈనెల 19న మాజీ సీఎం కిరణ్ కలికిరికి రాక

కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:



రాష్ట్ర మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 19న కలికిరి మండలానికి విచ్చేస్తున్నట్లు మాజీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప తెలిపారు. 19న హైదరాబాదులో బయలుదేరి తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి కలికిరి ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరఉకొని 21 వరకు కలికిరి మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో మాజీ సీఎం పాల్గొంటారని ఆయన పీఏ తెలిపారు.

# ఛైర్మెన్‌గా తట్టి శ్రీనివాసులురెడ్డి బాధ్యతల స్వీకరణ



మదనపల్లె, జనవరి 17 ప్రభాతవార్త :

మదనపల్లె మార్కెట్ యార్డు ఛైర్మెన్‌గా తట్టి శ్రీని వాసులురెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు వైస్‌ఛైర్మెన్ ఎంఆర్.వెంకటేష్ బాబు బాధ్యతలు చేపట్టారు. మార్కెట్‌యార్డు సెక్రటరీ అభిలాష్ ఆధ్వర్యంలో రిజిష్టర్‌లో సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డు ఆసియాఖండంలోనే అతి పెద్దదని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. తనకు ఛైర్మెన్ పదవి రావడం పట్ల ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్‌లతో పాటు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం

కురవంక సర్పంచ్ చలపతి



మదనపల్లె, జనవరి 17 ప్రభాతవార్త:

క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కురవంక గ్రామ పంచాయితీలో వాలీబాల్ టోర్నమెంటు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటమి గెలుపులను సాధారణంగా చూడాలన్నారు. ఓటమే గెలుపుకు సోపానం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశికుమార్, పునిత్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి



మదనపల్లె, జనవరి 17 ప్రభాతవార్త:

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని మదనపల్లె లారీ,ఐసర్ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి డిమాండ్ చేశారు. బుధవారం బసినికొండ వైజంక్షన్ శ్రీక్రిష్ణదేవరాయుల సర్కిల్ వద్ద అనంతపురం, క్రిష్ణగిరి జాతీయ రహదారిపై పట్టణంలోని లారీ డ్రైవర్లతో కలసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లను ఆర్తికంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టుందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే రూ.పదేళ్ళ జైలుశిక్షతో పాటు రూ.10లక్షల వరకు జరిమానా విధించేలా కేంద్రం తెచ్చిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. జయహో రథసారధి డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపి పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలో రాస్తారోకో నిర్వహించినట్లు తెలిపారు. నూతన చట్టం వల్ల పలువురు డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతారన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ మక్బుల్, ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ చంద్రా, బాబు, అక్బర్, రియాజ్, ఆదం, షబ్బీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నిమ్మనపల్లెలో వ్యక్తి అదృశ్యం

నిమ్మనపల్లె, జనవరి 17 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో ఓ వ్యక్తి అదృశ్యం అయినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. స్థానిక బస్టాండు ప్రాంతంలో పానీపూరి బండివేసి జీవించే వాడని తెలిసింది. ఇతను అదృశ్యంకు కారణాలు తెలియరాలేదని తెలిపారు.

# చలో విజయవాడ

రామసముద్రం, జనవరి 17 ప్రభాతవార్త :

భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ 19న విజయవాడలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిన ఆవిష్కరన సందర్భంగా రామసముద్రం మండల వైసిపి నాయకులు చలో విజయవాడ కార్యక్రమంతో బయలుదేరారు. మండలం నుంచి ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలు పేద బడుగు బలహీన వర్గాల వారు విజయవాడకు తరలివెళ్ళి కార్యక్రమాన్నివిజయవంతం చేసేందుకు తరలివెళ్ళారు.

# భార్యపై భర్త హత్యాయత్నం

మదనపల్లెక్రైం, జనవరి 17 ప్రభాతవార్త :



భార్యపై భర్త హత్యాయత్నంకు పాల్పడిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. చౌడేపల్లికి చెందిన నగేష్ 8 సంవత్సరాల క్రితం మదనపల్లె పట్టణం కొత్తిండ్లకు చెందిన జయమ్మ, రామన్న దంపతుల కుమార్తె హేమలత (27)ను వివాహం చేసుకున్నాడు. వివాహం అనంతరం ఈ దంపతులు మదనపల్లెలోనే నివాసం వున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు వున్నారు. హేమలత 3 సంవత్సరాల నుంచి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నది. ఈ క్రమంలో భార్య హేమలత ప్రవర్తనపై నగేష్‌కు అనుమానం కల్గింది. దీంతో వీరిద్దరు తరచూ ఘర్షణ పడేవారు. నెల రోజుల క్రితం ఇరుకుటుంబ పెద్దలు భార్యభర్తల మధ్య పంచాయితీ చేసి నివాసం చౌడేపల్లికి వెళ్లేలా చేశారు. అప్పటి నుంచి హేమలత రోజు చౌడేపల్లి నుంచి వచ్చి విధులు నిర్వహించి ఇంటికి వెళ్లేది. బుధవారం విధుల ముగించుకుని ఇంటికి వెళ్లటానికి ఆస్పత్రి బయటకు రాగానే అక్కడే వున్న భర్త నగేష్ కత్తితో భార్యపై హత్యాయత్నంకు పాల్పడ్డాడు. అందరూ చూస్తుండగానే ఈ సంఘటన జరగటంతో స్థానికులు రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జ్ సిఐ వల్లీబషు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటసుబ్బయ్య సంఘటన స్థలంకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలిని చికిత్సల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ, ఎస్ఐలు తెలిపారు.

# పల్లెల్లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



గుర్రంకొండ, జనవరి 17, ప్రభాతవార్త

మండలంలోని అన్ని గ్రామాలలో మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పల్లెలు బంధువులతో సందడిగా మారాయి. ప్రతి ఇంటి ముందు గొబ్బెమ్మలు, రంగవల్లులుతో ఆకట్టుకొన్నాయి. ఉదయంనుండీనే పశువులను నీటితో శుభ్రం చేసి పూజలు చేయడం జరిగింది. ఆయా గ్రామాలలో వారి సాంప్రదాయాలను బట్టీ పొట్టేళ్ళను, మేకపోతులను గంగమ్మ దేవతలకు బలి ఇవ్వడం జరిగింది. అనంతరం కాటంరాజు దగ్గరకు వెళ్లి పూజలు అనంతరం సాంప్రదాయం ప్రకారం చిట్లాకుప్పలను వేసి పాడి పశువులను అలంకరనలతో అక్కడకి తీసుకుపోయి డప్పులతో పశువులను బెదిరించడం జరిగింది. అనంతరం కాటంరాజు దగ్గర కుమ్మరులు చేసిన ప్రసాదాన్ని తీసుకొని భక్తులు వెళ్ళడం జరిగింది. కొన్ని గ్రామాలలో పశువులు లేక చిట్లాకుప్ప దగ్గర కల తప్పింది. యువకులు డాన్సులుతో చిందిలేశారు. గుర్రంకొండలో ముస్లిం సోదరులు కూడా పశువులకు అలంకరనలు చేసి వాటిని మంగళ వాయిద్యాలతో ఊరేగింపు గావించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అన్నిపార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాల వారిగా రా.. కదలిరా.. కార్యక్రమానికి తరలిరండి

తెదేపా శ్రేణుల సర్వసభ్య సమావేశంలో జాతీయనేత నల్లారి




పీలేరు, జనవరి 17ప్రభాతవార్తః

జనవరి 24న పీలేరులో తెదేపా జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల్లో తెదేపా గెలుపే లక్ష్యంగా రా.. కదలిరా.. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బహిరంగ సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నియోజకవర్గ బాద్యులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మండల, గ్రామీణ ప్రాంత తెదేపా నాయకులు, కార్యకర్తలు అనుబంద సంఘాలకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా తెదేపా కార్యాలయంలో తెదేపా శ్రేణులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన క్షేత్రస్థాయి బూత్‌స్థాయిలో తమకు అనుకూలంగా ఉన్న వాహనాల్లో పెద్ద ఎత్తున తరలిరావాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీల కార్పోరేషన్లను నిర్వీర్యం చేస్తూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమాలకు తూట్లు పొడిచిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి గద్దె దింపడమే తెదేపా లక్ష్యమన్నారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివద్ది తెదేపాతోనే సాధ్యమని దుర్మార్గపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రంలో మళ్లీ పూర్వ వైభవం రావాలని అందుకు అందరూ వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

# సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

పీలేరు, జనవరి 17 ప్రభాతవార్తః

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జనవరి 15వ తేదీ పాయిజన్ తీసుకున్న రోగితో పాటు వచ్చిన రోగి సహాయకులు డ్యూటీలో ఉన్న డాక్టరును దూషించి అసభ్య పదజాలంతో దూషించి వైద్య సిబ్బందిపై దాడి చేయడానికి ప్రయత్నించి వైద్య పరికరాలను ధ్వంసం చేశారు. ఇటువంటి చర్యలు ఏమాత్రం సహించరానివి. దీనికి బాధ్యులైన వారిపై అమలులో ఉన్న చట్టం ప్రకారం శిక్షించవలసిందిగా, ఇటువంటివి మళ్లీ పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచూ ఈసంఘటనను ఖండిస్తున్నామని ఐఎంఏ ప్రెసిడెంటు, సెక్రటరీ, కోశాధికారి వైద్యులు చంద్రశేఖర్, పవన్‌కుమార్, ఈశ్వరసురేంద్రలు కోరారు.

# విద్యుద్ఘాతంతో సిబ్బందికి గాయాలు

పీలేరు, జనవరి 17 ప్రభాతవార్తః



విద్యుతగాంతో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం తలపులలో చోటు చేసుకుంది. వివరాలు సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎమ్ గ్రేడ్-2 సచివాలయ ఉద్యోగి హరీష్(27), డిపార్టుమెంటు ఫీల్డు అసిస్టెంటు ఆర్ మునిప్రసాద్(25) ఇరు వురు బుధవారం ఉదయం ఎల్‌సీ తీసు కుని అప్పిరెడ్డిగారిపల్లె,మల్లేశ్వరపురం, మధ్యలో విద్యుత్ పనులు చేస్తుండగా డ్యూటీ ఆపరేటర్ లైన్‌మెన్ బాలాజీ సబ్‌స్టేషన్‌లో మద్యం మత్తులో విద్యుత్‌ను సరఫరా చేశారు. దీంతో విద్యుత్ పనులు చేస్తున్న ఇద్దరు విద్యుత్ స్తంబాల పై నుంచి కింద పడ్డారు. హరీష్‌కు తీవ్రగాయాలు, ముని ప్రసాద్‌కు స్వల్పగాయాలైయ్యాయి.. సమాచారం తెలుసు కున్న ట్రాన్సుకో ఈఈ మునిచందర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరి వారిరువురిని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. నిర్లక్ష్యం వహించిన బాలాజీ ని సస్పెండ్ చేసినట్లు ఈఈ తెలిపారు.

# క్రీడలతో మానసికోల్లాసం

గాలివీడు, జనవరి 17(ప్రభాతవార్త):



క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల వైకాపా మైనార్టీ యువ నాయకులు నిజాముద్దీన్ తెలిపారు. బుధవారం మండలంలోని అరవీడు గ్రామ పంచాయతీ ఎల్లంపల్లి వద్ద జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ప్రతి ఒక్కరూ ప్రస్తుత జీవనవిధానంలో క్రీడలు అలవాటు చేసుకోవాలని క్రీడాకారుల మధ్య స్నేహభావం కూడా పెంపొందుతుందన్నారు. అనంతరం రెండవ బహుమతిని రూ.5555లను అందజేశారు. వైకాపా నాయకులు శంకర్‌నాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మదనపల్లె మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జమున

మదనపల్లెక్రైం, జనవరి 17 ప్రభాతవార్త :

మదనపల్లె మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జమున బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డా.మురళీధర్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేసేవారు. ఆయన ప్రొపెసర్‌గా కొనసాగనున్నారు. ఈ క్రమంలో నెల్లూరు వైద్య కళాశాలలో అనస్థిషియా ప్రొపెసర్‌గా పనిచేస్తున్న జమున పదోన్నతిపై మదనపల్లె మెడికల్ కలాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జమున మాట్లాడుతూ సిబ్బందిని కలుపుకొని వారి సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# తక్షణమే బకాయిలు చెల్లించాలి

బద్వేలు , జనవరి17(ప్రభాతవార్త ):



ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎం.రవిశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తమకు ప్రభుత్వం న్యాయంగా అందించాల్సిన బకాయిలైన డిఏ, పీఆర్‌సీ, అరియర్స్, ప్రావిడెంట్ ఫండ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు,సరెండవ్ లీవ్‌లను అందించడంలో ప్రభుత్వం జాప్యం వహించడం తగదన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచ్కుఉన్న సొమ్మును సరైన సమయానికి ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం వలన వారు మానసిక ఆవేదనకు గురవుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని తమకు న్యాయంగా అందించాల్సిన బకాయిలు వగైరాలు తక్షణమే చెల్లించాలని కోరారు.

# గ్రామీణ ప్రాంతంలో క్రీడలు క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు

– టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి



రామాపురం, జనవరి 17, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతంలో క్రీడలు క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని రాయచోటి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం రామాపురం మండలం రాచపల్లి పంచాయతీ గంగనేరు కోటర్స్ సమీపంలో టీడీపీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రిన్స్ లెవెన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆయన హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా రాచపల్లి వడ్డేపల్లికి చెందిన క్రీడాకారులు గెలుపొందారు. రన్నర్స్‌గా అదే గ్రామానికి చెందిన క్రీడాకారులు నిలిచారు. మొదటి బహుమతిగా రూ.30,126, 2వ బహుమతి రూ.20116 జట్టుకు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభ చాటుకునేందుకు ఇలాంటి టోర్నమెంట్లు చక్కటి వేదిక అన్నారు. క్రీడల్లో మానసిక శారీక ఉత్సాహం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాచపల్లె గ్రామం టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడు నెలల్లో శ్రీకృష్ణదేవరాయల పాలన రాబోతోంది

– నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల, జనవరి 17, ప్రభాతవార్త ః



ఆంధ్రప్రదేశ్‌లో మరో మూడు నెలల్లో శ్రీకృష్ణదేవ రాయల పాలన రాబోతోందని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల హయాంలో రాయలసీమకు చేసిన సేవలను గుర్తుచేశారు. అదే విధంగా మరో మూడు మాసాలలో రాష్ట్రంలో శ్రీకృష్ణదేవరాయల పాలన సాగుతోందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని రాజధానిలేని రాష్ట్రం చేశారని, అంతేకాకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. మరో మూడు మాసాలలో చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో శ్రీకృష్ణదేవరాయల పాలన రాబోతోందని ఆయన జోష్యం చెప్పారు. ఈనెల 19న చంద్రబాబునాయుడు కడపజిల్లాలోని కమలాపురం పర్యటిస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని తెదేపా నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వేంపల్లె, జనవరి 17, ప్రభాతవార్త ః



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని వేంపల్లె సీఐ చాంద్‌బాషా హెచ్చరించారు. బుధవారం ఆయనతో పాటు ఎస్సై తిరుపాల్‌నాయక్, సిబ్బంది కలిసి మట్కా, జూదం ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించారు. అనంతరం వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. స్థానిక చింతలమడుగుపల్లె క్రాస్ వద్ద మట్కా నిర్వహిస్తున్న ఐదు మందిని, రూ.44వేల నగదును, అలాగే రాజీవ్‌నగర్ కాలనీలో జూదం ఆడుతున్న ఆరు మందిని, వారి నుండి రూ.5500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరాలు వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని, ఎలాంటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రమణమూర్తి, కానిస్టేబుళ్లు కిరణ్, మహేష్‌లు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే కాంగ్రెస్ లక్ష్యం

వేంపల్లె, జనవరి 17, ప్రభాతవార్త ః



2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో అధికారంలోకి రావడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉందన్నారు. మొన్న కర్ణాటక, నిన్న తెలంగాణలో అధికారంలోకి వచ్చినట్లే రేపటి ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కలికిరిలో ఘనంగా సంక్రాంతి పండగ

– ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ

కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:



కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో శ్రీఅంకాలమ్మ ఆలయం వద్ద బుధవారం సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని అంకాలమ్మ దేవత ఆలయం నిర్వాహకులు సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో కలికిరి పంచాయతీలోని యువకులు, మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు వాల్మీకిపురం సీఐ సురేష్‌కుమార్, ఎస్సై ఎస్‌కే రహీముల్లాలు ప్రదానం చేశారు.

## ఘనంగా ముగిసిన గుండు గంగమ్మ జాతర ఉత్సవాలు



రామాపురం, జనవరి 17, ప్రభాతవార్త:

మండలంలోని గోపగుడిపల్లె కస్పానందు బుధవారం గుండు గంగమ్మ గౌరమ్మ తల్లుల జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ జాతర సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ జాతర పూర్వం పెద్దల కాలం నుంచి సంప్రదాయబద్దంగా వస్తోందని ఈ జాతర నిర్వహస్తున్నామని ఆలయ కార్యనిర్వాహకులు పందోళ్లపల్లి బలరామయ్య తెలిపారు. ఈ జాతరకు గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి ఇతర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు, మహిళలు హాజరయ్యారు. అనంతరం గ్రామంలో జనవరి 1వ తేదీ నుంచి 17 వరకు గౌరమ్మ తల్లికి ప్రతి రోజూ మహిళలు పూజలు చేసి బుధవారం ఆమె విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామ పురవీధుల్లో బాణా సంచా డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## పట్టువిడని అంగన్‌వాడీల సమ్మె




దువ్వూరు, జనవరి 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని అంగన్‌వాడీలు గత 38 రోజులుగా పట్టువిడవకుండా సమ్మె కొనసాగిస్తున్నారు. సీఐటీయూ యూనియన్ నాయకుల పిలుపు మేరకు సిబ్బంది సమైక్యంగా ఉంటూ తమ డిమాండ్ల సాధన కోసం ప్రతి రోజు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నారు. సాయంత్రం వరకు నిరవధిక దీక్షలు చేస్తూ 38వ రోజులుగా సమ్మె చేస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచే వరకు తమ ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో సమాచార బోర్డు ఏర్పాటు చేయాలి




మైదుకూరు రూరల్, జనవరి 17, ప్రభాతవార్త:

కడప జిల్లా మైదుకూరు పోరుమామిళ్ల రహదారి వనిపెంట రోడ్డు తెలుగు కాలనీలో తహశీల్దార్ మరియు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కార్యాలయంలో పల్లె ప్రజలకు సమాచార హక్కు చట్ట ప్రకారం అధికారుల పేర్లు వివరాలు వారి సమాచారం తెలపాలని ఉన్న ఎక్కడ బోర్డు లేదు వారి సమాచారము కూడా తెలియపరచలేదు దీంతో గ్రామాల నుండి వచ్చే ప్రజలు వారి సమాచారం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారు.అంతేకాకుండా మైదుకూరు కడప రోడ్డు ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో ఉన్న తహశీల్దార్ మరియు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కార్యాలయం తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలు కోసం కార్యాలయాన్ని ఒనిపెంట రోడ్డు తెలుగు కాలనీ లో నిర్మించడం జరిగింది. సుదూర గ్రామాలనుంచి వచ్చే ప్రజలు కార్యాలయానికి వెళ్లాలంటే ఎన్ని ఇబ్బందులో కనీసం కార్యాలయ ఆవరణంలో మంచి నీరు కూడా లేకపోవడం చాలామంది గమనించి ఉంటారు. చాలా దూరం నుంచి వచ్చిన వారికి కనీస సౌకర్యాలు కూడా లేవు పరిపాలన పాలకులు అధికారులు కనీసం వయస్సు మీద పడిన పెద్దవారు. వికలాంగులు, మహిళలు, నడిచి కార్యాలయానికి వస్తే మంచినీరు కూడా సౌకర్యం కల్పించని అధికారులు ఇప్పటికైనా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి అక్కడికి వచ్చిన ప్రజలకు మంచినీరు అలసిపోయి వచ్చిన వారికి కూర్చోవడానికి వసతి కల్పించాలని కార్యాలయం వరకు వచ్చి అలసిపోతున్న ప్రజలు కోరుకుంటున్నారు. సమాచార బోర్డు కూడా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అధికారులు ఏమాత్రం స్పందిస్తారో వేచి చూస్తాం.

## సీఎం, మంత్రులు దావోస్‌లో పాల్గొనకపోవడంపై నోరు విప్పాలి

– తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 17, ప్రభాతవార్త ః

ప్రపంచ దేశాలు, భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు పోటీపడి దావోస్‌లో జరిగే ఆర్థిక వేదికలో పాల్గొనడానికి తహతహలాడి పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నం చేస్తోంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డిలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, దావోస్‌లో ఎందుకు పాల్గొనలేదో కారణాలు బహిర్గతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటి జనరల్ సెక్రెటరీ కె.సి.బాదుల్లా డిమాండ్ చేశారు. బుధవారం వేంపల్లెలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్లకు ఒక్కసారి మాత్రమే దావోస్‌లో ఆర్థిక సదస్సులో పాల్గొంటారని ఆయన గుర్తుచేశారు. కడపలో ఉక్కు కర్మాగారం, రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పరిశ్రమలు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న పరిశ్రమలు సైతం ఇతర రాష్ట్రాలకు అమర్‌రాజా తదితర పరిశ్రమలు తరలిపోతే వాటి నివారణకు ఏ మాత్రం చర్యలు తీసుకోలేని పరిస్థితిలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉద్దె మద్దిలేటి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి బల్లారపు రామాంజనేయులు, కోశాధికారి దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బద్వేలు రూరల్ , జనవరి17(ప్రభాతవార్త ):

అట్లూరు, గోపవరం మరియు బద్వేలు మండలాల పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్‌శాఖ బద్వేలు డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.కుళాయప్ప, బద్వేలు రూరల్ ఏఈ చిన్నయ్యలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132కేవి. విద్యుత్ లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ఈ అంతరాయం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. కావున ప్రజలు ఇందుకు సహకరించాలన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయ 553వ జయంతి వేడుకలు

బద్వేలు , జనవరి17(ప్రభాతవార్త ):



శ్రీకృష్ణదేవరాయ 553వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం పూలమాల వేసి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘంఅధ్యక్షులు దద్దం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొర్రపాటి సురేంద్ర లు మాట్లాడుతూ ఆనాడు రాయలసీమను రతనాల సీమగా మార్చిన ఘనత కృష్ణదేవరాయులకే దక్కుతుందని, ఆయన గొప్ప పరిపాలనాధ్యక్షులని, ఆయన పాలనలో పేద, బడుగు, బలహీనవర్గాల వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకునిగా పేరు తెచ్చుకున్నారన్నారు. కానీ కొందరి పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ ఎంతో వెనుకబడి పోయిందన్నారు. ఆయనతెలుగుభాషకోసం కోసం పాటుపడుతూ సాహితీ సమరాంగణ భౌమునిగా కీర్తి గడించారని, ఆయన పాలనలో వ్యవసాయానికి పెద్దపీట వేశారన్నారు. తెలుగు ఖ్యాతిని దశదిశలా వ్యాపింప చేసి దేశభాషలందు తెలుగులెస్స అని చాటి చెప్పి గొప్ప వ్యక్తిఅని కొనియాడారు. తెలుగు ప్రజలలో శాశ్వత కీర్తిని సంపాదించుకున్న అలాంటి వ్యక్తి అడుగుజాడలలో మనం నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శింగంశెట్టి వెంకటసుబ్బయ్య, చిన్ని సుబ్బారావు , ఎల్ఐసీ సుబ్బారావు, ఆవుల వెంకట్, హనుమంతు బాలనరసింహులు శ్రీను, తదితర బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలలో త్వరితగతిన కనీస సౌకర్యాలు కల్పించాలి

– జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్



రాయచోటి, జనవరి 17, ప్రభాత వార్త :

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలపై తహశీల్దార్‌లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈ నెల 26వ తేదీ లోపు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇందులో ముఖ్యంగా ర్యాంపులు, టాయిలెట్స్, తాగునీరు, నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, ఫర్నిచర్ విద్యుత్ సౌకర్యం, లైటింగ్ వంటి అన్ని వసతులు తప్పని సరిగా ఉండాలన్నారు. 70 పోలింగ్ కేంద్రాలలో కరెంట్ సదుపాయం లేదని, వెంటనే వీటికి కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని ఏపిఎస్‌పిడిసిఎల్ అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పకుండా 3 పిఎస్ సాకెట్ ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్‌కు స్లాబు, ఫ్లోరింగ్ తప్పకుండా ఉండాలని, కేంద్రం నంబర్లు, పెయింటింగ్ చేయించాలన్నారు. సెక్టోరల్ అధికారులు కనీస సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓలు, రాయచోటి, మదనపల్లె, రాజంపేట రాంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి,

## షాదీఖానాను త్వరలో వినియోగంలోకి తీసుకవస్తాం

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి, జనవరి 17, ప్రభాత వార్త :

రాయచోటి పట్టణంలోని షాదీఖానాకు మరమ్మత్తులు చేపట్టి త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలోని షాదీఖానాను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మున్సిపల్ ఇంజనీరింగ్, ఆర్ అండ్ బి అధికారులతో కలసి శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. షాదీఖానాలోని గోడలు, కిటికీలు, స్లాబ్, టాయిలెట్లు తదితర విభాగాలను మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆర్ అండ్ బి డిఇ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ డిఇ సుధాకర్‌నాయక్, ఎఇ కృష్ణారెడ్డి, ఆర్ అండ్ బి ఎఇ గిరీశ్వరరావులతో చర్చించి మరమత్తులకు త్వరితగతిన ఎస్టిమేషన్లను తయారు చేయాలని సూచించారు. పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం షాదీఖానాను అభివృద్ధి చేస్తామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, కొలిమి చాన్‌బాష, అల్తాఫ్, ఆసీఫ్, అలిఖాన్, జాకీర్, సాదిక్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, పట్టణ జేఏసి కన్వీనర్ నిస్సార్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, కో ఆప్షన్ సభ్యులు అయ్యవారు రెడ్డి, హజరత్, యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి ఇంతియాజ్, నవాజ్ క్రిష్, జావీద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానికి కలిసిన పోతుగుంట



(అన్నమయ్య ప్రతినిధి – ప్రభాతవార్త)

ప్రధానమంత్రి నరేంద్రమోడీని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు పుట్టపర్తి విమానశ్రయంలో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని పోతుగుంట రమేష్‌నాయుడు యోగక్షేమాలతో పాటు బాధ్యతలు, పేరు అడిగి తెలుసుకోవడం జరిగింది. పుట్టపర్తి వద్ద పాల సముద్రంలో దేశం గర్వించదగ్గ నాసిన్ సంస్థను ప్రారంభించడానికి వచ్చిన సందర్భంగా ప్రధానిని కలవడం పట్ల రమేష్‌నాయుడు మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఐపిఎస్‌లకు హైదరాబాద్‌లోని సర్దార్ వల్లబాయ్ అకాడమీ ద్వారా దేశంలో సెలెక్ట్ అయిన వారందరికి ట్రైనింగ్ ఎలా ఇస్తున్నారో అలాగే ఇండియన్ రెవిన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)లో సెలెక్ట్ అయిన వారందరికి మన రాష్ట్రంలోని ఈ నేషన్ సంస్థలు ట్రైనింగ్ ఇచ్చే గొప్ప సంస్థని 500 ఎకరాల్లో రూ.500 కోట్ల ఖర్చుతో నిర్మించిన నాసిన్ సంస్థని ప్రధాని ప్రారంభించడం మన రాష్ట్రానికి ఎంతో గర్వకారణమన్నారు.

## పుట్టగొడుగులతో పోషకాహారం, ఉపాధి

శాస్త్రవేత్త డాక్టర్ రూత్

రైల్వేకోడూరు రూరల్, జనవరి 17 ప్రభాతవార్త :



రైల్వేకోడూరు నియోజకవర్గంలోని తిరుగుడుపల్లె గ్రామంలో పుట్టగొడుగులతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే గ్రామీణ మహిళలకు బుధవారం మహిళలకు డాక్టర్ రూత్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఐసిఎఆర్ ఎస్‌సి సబ్‌ప్లాన్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని ఆమె తెలిపారు. గ్రామంలో పుట్టగొడుగుల యూనిట్ ప్రారంభించి పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని ఆమె అన్నారు. ఈ పుట్టగొడుగులను ఉపయోగించి పుట్టగొడుగుల పకోడి, పుట్టగొడుగుల సూప్, పుట్టగొడుగుల పచ్చడి(పికెల్) తయారు చేసి వాటిలో ఉన్న పోషకాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరాజ్య లక్ష్మీ, ఆచార్యులు, ఉద్యాన విద్యార్థులు, ఇఎల్‌పి403 పాల్గొన్నారు. గ్రామీణ మహిళలు వెంకటలక్ష్మి, చెంగమ్మ, వెంకటసుబ్బమ్మ, బి.సుబ్బమ్మ, రుషికాంత, శ్వేత, తేజశ్విని, శంకర్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థులతో పుట్టగొడుగుల ద్వారా ఉపయోగాలను, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఉపయోగాలను తెలుసుకోవాలని వారు సూచించారు.

## క్రీడల ప్రాధాన్యతే విద్యార్థులకు ప్రమాణికం

జడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట, జనవరి 17, ప్రభాతవార్త



విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ప్రామాణిక మని, ఉమ్మడి కడప జిల్లా ల, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజంపేట పట్టణంలోని ఇన్ఫాంట్ స్కూల్ నందు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలు, రాజంపేటలో నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఇలాంటి ఆటలు, పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, బాగా చొరవ చూపాలన్నారు. ఇప్పటికే రాజంపేట పట్టణంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆటలు పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు విద్యతోపాటు క్రీడలకు కూడా ఎంతో ప్రాధాన్యతనిచ్చి, ఇలాంటి ఆటలు పోటీలు నిర్వహిస్తామన్నారు. గత రెండు సంవత్సారాల నుంచి ఉమ్మడి జిల్లాలైన కడప జిల్లా స్థాయిలో కూడా అనేక స్థాయి ఆటలు పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇటీవల రాజంపేట పట్టణంలో అన్నమయ్య గుర్తుండేదన్నారు. ఇలాంటి అన్నమయ్య జన్మించిన ఈ రాజంపేట పట్టణం ఒక పవిత్రమైనదని ఆయన కొనియాడారు. అంతకముందు భూమి పూజ చేసి ఆయన కొబ్బరికాయ కొట్టారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డి.ఈ.ఓ వరలక్ష్మి మండల జడ్పీటిసి, ఎంపిపి, వైఎస్.ఆర్సి.పి నాయకులు కుమార్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, ఆదినారాయణ రెడ్డిల తో పాటు మండలంలోని ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయ సహకార పరపతి సంఘ కమ్యూనిటి హాలును ప్రారంభించిన ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం , జనవరి17(ప్రభాతవార్త ):



మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన వ్యవసాయ పరపతి సంఘం కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీ రాణి, సహకార పరపతి సంఘం చైర్మన్ నేలటూరి సుబ్బారెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రఘురామిరెడ్డి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే కమిటి హాలును ఏర్పాటుచేసిన కాంట్రాక్టర్‌ను, చైర్మన్ సుబ్బారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. మండలంలో రైతులు సహకార పరపతి సంఘం వద్దకు వచ్చి అన్ని బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి క్రాప్‌లోన్లు, బంగారుపై లోన్లు, వాహన లోన్లు తీసుకుని సకాలంలో చెల్లించాలని ఈ అవకాశాన్ని మండల ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శెట్టి గుంట నాగిరెడ్డి, జడ్పీటీసీ రామగోవిందరెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, ఎంపీటీసీ మనోహరాచారి, సర్పం చ్‌లు చిన్న ఓబుళరెడ్డి, చెన్న క్రిష్ణారెడ్డి, అనంతరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బాల రామి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మేకల రత్నకుమార్ యాదవ్, సహకార పరపతి సంఘం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయనాలకు అనుగుణంగా జగనన్న పాలన

బద్వేలురూరల్ , జనవరి17(ప్రభాతవార్త ):

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదిన విజయవాడలో డాక్టర బి.ఆర్ అంబేద్కర్ స్మృతివనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం , అత్యున్నత పదవులను కల్పించిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచేలా విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం జగన్ దళితుల పక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు.

## బీసీలు ఏదైన సాధించగల నేర్పురులు

బీసీ నేత చెన్నా సరళాదేవి

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 17, ప్రభాతవార్త:



బీసీలు ఏదైన సాధించగల నేర్పుగలవారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి తెలిపారు. బుధవారం ఆమె ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో బీసీ మేలుకో అనే రాజకీయ చర్చా వేదిక నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలంటే వెనుకబడిన వారు కాదని, అన్ని రంగాలలో రాణించగల నేర్పుగల వారని స్పష్టం చేశారు. బీసీలకు రానున్న సార్వత్రిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ బీసీలలో ఎవరు ఎదుగుతున్న వారికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. బీసీలకు ఏ సమస్య వచ్చిన తాను ముందుంటానని భరోసా కల్పించారు. న్యాయవాది గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలను కాపాడుకునే వ్యవస్థలు ఆనాడు అందుబాటులో లేవని, కానీ ప్రస్తుతం తాను బీసీలను ఎలాంటి సమస్యలో ఉన్న కాపాడుకుంటానని వివరించారు. బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షులు బొర్రా రామాంజినేయులు మాట్లాడుతూ నిరంతరం ప్రజలలో ఉంటూ, ప్రజాసమస్యలపై పోరాటం చేస్తు రాజ్యాల కారం మనదే అని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. కులదేవతల ఆశీర్వాదం తీసుకోవడం, పార్టీ అధికార ప్రతినిధులను కలిసి సీట్లు ఇవ్వాలని కోరడం, అంబేద్కర్, పూలె విగ్రహాలకు పూలమాలల సమర్పణ, సమావేశం ఏర్పాటుచేయడం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జింకా సుబ్రమణ్యం, సంధు శివనారాయణ, చౌడం కొండయ్య, రామదాసు, మల్లెల భాస్కర్, కొండపల్లి శేశగిరి, చంద్రమౌళి, వెంకటకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ నగదు లావాదేవీలలో ప్రజలు అప్రమత్తంగా ఉండండి

ఎమ్మెల్యే రాచమల్లు విజ్ఞప్తి

ప్రొద్దుటూరు, జనవరి 17, ప్రభాతవార్త:



రాష్ట్రంలో 2024 ఫిబ్రవరి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న నేపథ్యంలో పోలీసు చర్యల వల్ల అసౌకర్యానికి గురికాకుండా ఉండాలంటే నగదు లావాదేవీలలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమీషన్ సమాయత్తమవుతున్న సంగతి తెలిసిందేనన్నారు. అందులో భాగంగా ఇటివల పోలీసు తనిఖీలలో వ్యాపారులకు సంబంధించిన నగదును సీజ్ చేసి ఆదాయపు పన్ను శాఖ తిరుపతి వారికి పంపిన సంఘటనలు చూశామన్నారు. కావున ఎన్నికల సమయంలో నగదు లావాదేవీలలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి జాగ్రత్త వహించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేవలం ఖాతాల లావాదేవీలు జరుపుకుంటేనే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కనీసం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యేంతవరకు అయిన పోలీసులు అత్యుత్సాహం చూపక సామాన్య వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

### స్కిల్ కేసులో చంద్రబాబుకు జైలు తప్పదు – ఎమ్మెల్యే

అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు జైలు తప్పదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వంలో బాగస్వామ్యులుగా ఉండి ప్రజాధనాన్ని దోచుకున్నారని అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే కానీ చంద్రబాబు 52రోజుల జీవితంలో ఈ నేరం చేయలేదని ఏనాడు కోర్టుని ఆశ్రయించలేదన్నారు. ఈ కేసులో నమోదైన 17ఏ సెక్షన్ తనకు వర్తించదని కేసు కొట్టివేయాలని క్యాష్ పిటిషన్ వేసిన సంగతి గుర్తుచేశారు. నేడు సుప్రింకోర్టు ధర్మాసనంలోని ఇద్దరు నాయమూర్తులు వాదనను సమర్ధించాలే తప్ప రిమాండ్ తప్పని చెప్పలేదన్నారు. ఎప్పటికైన ప్రజాధనం దోచుకున్న చంద్రబాబుకు జైలు జీవితం తప్పదని ఆయన జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయల పరిపాలన రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకం

పులివెందుల రూరల్, జనవరి 17, ప్రభాతవార్త ః



విజయనగర సామ్రాజ్యాధినేత, సర్వసైన్యాధ్యక్షుడు శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం ఉదయం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పరిపాలన ఈనాటి నాయకులకు, పాలకులకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన హయాంలో దేవాలయాలను, చెరువులను చేసిన అభివృద్ధిని ఆదర్శంగా తీసుకుని నేడు జగనన్న దేవాలయాలు, చెరువులపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం పద్మారావు రాయల్ రచించిన అఖిలభారత బలిజ, కాపు కళాకారులు, క్రీడాకారులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

### – ఆదర్శ పాలకుడు శ్రీకృష్ణదేవరాయలు ః

ప్రస్తుతం పాలిస్తున్న పాలకులకు ఆదర్శ పాలకుడు శ్రీకృష్ణదేవరాయలు అని జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా పట్టణంలోని దేవరాయల విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన ఏ విధంగా ప్రజారంజక పాలన చేయాలో అందరికీ తెలిసేలా విధి విధానాలకు భవిష్యత్తు తరాలకు అందించిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్‌రెడ్డి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్ట్ వ్యవహారం ముమ్మాటికి తప్పే

టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు

రాజంపేట అర్బన్, జనవరి 17 ప్రభాతవార్త



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జగన్ సర్కార్ చంద్రబాబు అరెస్ట్ వ్యవహారంలో బాధ్యతగా వ్యవహరించలేదని, ఇది ముమ్మాటికి తప్పేనని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేస్తోందని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేసులో ఇద్దరు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసినా తీర్పు మూలాలను పరిశీలిస్తే చంద్రబాబు అరెస్ట్ నిబంధనల ప్రకారం జరగలేదని స్పష్టమైందన్నారు. ఇది చట్ట విరుద్ధమని అన్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం కక్ష్యపూరితంగా వ్యవహరించి ప్రతిపక్ష నేతగా ఉన్నా కనీస నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. కేసులో పూర్తి చట్టబద్ధత ఉన ్నప్పుడు మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందని, అలా కాకుండా అధికారంలో ఉన్నామనే అహంకారంతో వ్యవహరించిందని, రానున్న రోజుల్లో చంద్రబాబు కడిగిన ముత ్యంలా బయటకు వస్తారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని దుర్మార్గంగా వ్యవహరించగలరేమోగాని వచ్చే ఎన్నికల్లో ప్రజాకోర్టులో జగన్‌కు పరాభవం తప్పదని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై ఎన్ని కేసులు పెట్టినా, ఇరికించినా ఇంతవరకు నిధుల మళ్లింపుకు సంబంధించిన ఆధారాలు చూపలేకపోయిందని, ఒక్క కేసులో ఛార్జీషీటు దాఖలు చేయలేకపోయిందని, చంద్రబాబు నిజాయితిని ఇది స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. ఈ కేసును వాదిస్తున్న ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రజల సొమ్ము జీతంగా తీసుకుంటూ వైసిపి పార్టీ తరపున వాదిస్తున్నట్లు వ్యవహరించారని ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నాడు తెలుగుదేశంపార్టీ పిలుస్తోంది రా... కదలిరా అంటూ పిలుపునిచ్చి దేశ చరిత్రలో ఒక ప్రాంతీయపార్టీ చరిత్ర సృష్టించేలా చేశారని, అదే పిలుపుతో నేడు మరలా చంద్రబాబు నాయకత్వంలో ఇస్తున్న పిలుపుకు రాష్ట్ర ప్రజలు వెల్లువెత్తుతున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్ సర్కార్‌ను ప్రజలు బంగాళాఖాతంలో కలపడం ఖాయమని అన్నారు. సమావేశంలో టిడిపి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, మండలపార్టీ అధ్యక్షులు సతీష్‌రాజు, శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్యనాయుడు తదితరులు పేర్కొన్నారు.

## గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి కృషి

పులివెందుల టౌన్, జనవరి 17, ప్రభాతవార్త ః



గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని ఆహారవిజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ అన్నారు. కళాశాలకు చెందిన నాల్గో సంవత్సరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జాతీయ సేవా పథకంలో భాగంగా ఏడు రోజుల పాటు లింగాల మండలంలోని ఇప్పట్లలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామస్థులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచి అంకాలమ్మ మాట్లాడుతూ ఈ శిబిరానికి సహకారం అందిస్తానని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని సమస్యలు, వారి జీవన విధానం మీద సర్వే నిర్వహించారు.